

పార్క్‌లోని జింకలు, దుప్పులు

సండే స్పెషల్

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జింకలు, దుప్పులకు అడ్డాగా నిలుస్తోంది. అడవిలో మాత్రమే కనిపించే చుక్కల జింకలు, దుప్పులు మూడింటిని ఇక్కడ ఏర్పాటుచేసిన పార్క్‌లో వదలగా వాటి సంతతి నానాటికీ పెరుగుతుండడంతో సందడి చేస్తున్నాయి. శరీరంపై తెల్లని మచ్చలు, కొమ్ములతో అందంగా కనిపిస్తూ చెంగు చెంగున గంతులేసే జింకలు, దుప్పులకు ఆవాసంగా మారిన కిన్నెరసాని పార్క్ ఏర్పాటై నేటితో యాభై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

కిన్నెరసాని.. జింకల అడ్డా!



కిన్నెరసానిలో డీర్‌పార్క్ ముఖద్వారం (ఇన్‌సెట్) నాటి సీఎం జలగం వెంగళరావు ప్రారంభించిన శిలాఫలకం

డీర్ పార్క్ ప్రారంభమై నేటితో 50 ఏళ్లు
- 1974లో ప్రారంభించిన నాటి సీఎం వెంగళరావు
- నాడు మూడు జింకలు.. నేడు 135
- పర్యాటకుల రాకతో ఏటేటా పెరుగుతున్న ఆదాయం

సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాటు...

పాల్వంచకు 12 కి.మీ. దూరంలోని కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని రిజర్వాయర్ వద్ద పర్యాటకుల సందర్శనార్థం సింగరేణి కాలరీస్ ఆధ్వర్యాన డీర్‌పార్క్‌ను ఏర్పాటుచేశారు. 14 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ పార్క్‌ను 1974 సెప్టెంబర్ 29న నాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. ఆతర్వాత 2012లో రూ.11లక్షల వ్యయంతో 720 మీటర్ల మేర ఇనుప కంచె నిర్మించారు. నాడు జింకలు, దుప్పులు కలిపి మూడింటిని వదలగా నేడు వాటి సంతతి 135కు చేరింది. ఇందులో ఆడవి 54, 81 మగ వాటితో పాటు 20 పిల్లలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీటికి తోడు ఇదే పార్క్‌లో ఐదు మూషిక జింకలు, కొండగొర్రెలు కూడా ఉన్నాయి.

పాతికేళ్ల క్రితం వైల్డ్‌లైఫ్ పర్యవేక్షణలోకి...
తొలుత జింకల పార్క్‌ను సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాటుచేయగా సంరక్షణ, నిర్వహణ బాధ్యతలను సంస్థ 1998 వరకు చేపట్టింది. ఆతర్వాత 1999లో వైల్డ్‌లైఫ్ శాఖకు అప్పగించగా వారే పర్యవేక్షిస్తున్నారు. జింకల ఆహారం కోసం రెండు హెక్టార్ల విస్తీర్ణంలో గడ్డి పెంచుతున్నారు.

ఏడాదికోసారి సంతానోత్పత్తి
ఏటా జింకలు సంతానోత్పత్తి చేస్తాయి. ఆడ జింకలు ఏటా ఆగస్టులో పిల్లలకు జన్మనిస్తాయి. ఒక్కో విడతలో ఒకటి లేదా రెండు పిల్లలు జన్మిస్తాయి. కాగా, 2009లో పార్క్‌లోకి ఊరకుక్కలు దూరి తొమ్మిది జింకలను చంపేశాయి. ఈ ఘటనతో పార్క్‌కు ఇనుపకంచెను పటిష్టం చేశారు. అంతేకాక సామర్థ్యానికి మించి జింకలు ఉండడంతో అదే ఏడాది ఆరు జింకలను రంగాపురం అటవీ ప్రాంతంలో వదిలారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉండడంతో కొన్నింటిని అడవిలో వదిలేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.

అరకొర నిధులు
డీర్ పార్క్‌లోని జింకలకు ఆహారం సమకూర్చేందుకు ప్రభుత్వం నుంచి అరకొరగానే నిధులు మంజూరవుతున్నాయి. దీంతో వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు ఆ స్థాయిలోనే ఆహారం అందిస్తున్నారు. ఫలితంగా జింకలు బక్కచిక్కుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు పూటలా గడ్డి సమకూరుస్తున్నా లెక్కకు మిక్కిలిగా ఉన్న జింకలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో డీర్ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఏదైనా ఆహారం పెడతారోనని ఆశగా ఎదురుచూస్తుంటాయి.

రూ.2.76కోట్లకు పైగానే ఆదాయం
కిన్నెరసాని డీర్ పార్క్‌లోని జింకలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులు టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 2003–2004 నుంచి టిక్కెట్లు అమ్ముతుండగా ఇప్పటివరకు వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.2,76,23,281 ఆదాయం లభించింది. తొలి ఏడాది 2003–2004లో పర్యాటకుల ద్వారా రూ.2,46,194 ఆదాయం సమకూరగా, గడిచిన 2023–2024లో ఆదాయం రూ.36,37,795గా నమోదైంది.

విస్తీర్ణం పెంపు.. చైన్‌లింక్ కంచె



డీర్‌పార్క్ ఏర్పాటై నేటితో యాభై ఏళ్లు పూర్తికానున్నాయి. పార్క్‌లో జీవాల సంరక్షణకు విస్తీర్ణాన్ని మరో 6.5 కిలోమీటర్ల మేర పొడిగించాం. అంతేకాక రూ.1.25కోట్ల వ్యయంతో చైన్ లింక్ కంచె ఏర్పాటుచేశాం. జింకలకు ప్రతిరోజు పౌష్టికాహారం అందిస్తున్నాం. నీటి కోసం ప్రత్యేక చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. భద్రత కోసం రాత్రింబవళ్లు సిబ్బంది పహారా కాస్తున్నారు.
– కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు, కల్యాణం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీ సేవ జరిపించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, విజయవాడకు చెందిన కుప్ప వెంకటశ్రీనివాసరావు దంపతులు శ్రీఅలివేలు మంగ అమ్మవారికి రూ.2లక్షల విలువైన ముత్యాల కవచం బహూకరించారు. ఈవో జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు కట్టినట్లుగా కళారూపం


నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

వైరా: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై ప్రజా నాట్య మండలి రూపొందించిన 'రైతాంగ శౌర్యయాత్ర' నాటికను శనివారం వైరా, గండగలపాడు, విప్పలమడక, ఖానాపురం గ్రామాల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులు నాటి పోరాట క్రమాన్ని అద్భుతంగా ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రదర్శనలను ప్రారంభించి మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై కౌలు రైతులు, కూలీలు జరిపిన వర్గ పోరాటం ప్రపంచ ఖ్యాతి గడించిందని తెలిపారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు ఆనంద్, లక్ష్మీనారాయణతో పాటు నాయకులు బొంతు రాంబాబు, సదానాంద్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, మల్లెంపాటి రామారావు, సుంకర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎగవేతకు బాధ్యులెవరు ?!

- కొన్ని మిల్లుల నుంచి భారీగా సీఎంఆర్ బాకీ
- అయినా దృష్టి సారించని పౌరసరఫరాల సంస్థ అధికారులు
- నిబంధనల ప్రకారం తనిఖీలు చేయకుండా అలసత్వం
- 'మామూలు'గా ఆఫీసుల్లోనే కూర్చుని నివేదికలు


మిల్లులో ధాన్యం వివరాలు ఆరా తీస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ జిల్లాలోని 66 మిల్లులకు కేటాయించగా.. కొన్ని మిల్లులు ధాన్యం మర ఆడించినా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను మాత్రం తిరిగి ఇవ్వకుండా పక్కదారి పట్టించాయి. మిల్లుల్లో ధాన్యం కానీ బియ్యం కానీ నిల్వ లేవని తెలిసినా పౌరసరఫరాల సంస్థ అధికారులు దృష్టి సారించలేదు. పౌర సరఫరాల సంస్థలో అధికారుల మధ్య సమన్వయం లేమి కారణంగా తనిఖీలు చేయకుండానే నివేదికలు ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ముడుపులు ముట్టడడంతో మిల్లుల యాజమాన్యాలు భారీ కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐదు మిల్లుల్లో రూ.200 కోట్ల మేర విలువైన సీఎంఆర్ పక్కదారి పట్టించినట్లు గుర్తించడం గమనార్హం.

వారి మెడకు చుట్టుకుంటుందా?
తీగ లాగితే డొంక కదిలిన చందంగా సీఎంఆర్ చెల్లించని మిల్లులపై హైదరాబాద్‌కు చెందిన పౌరసరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేయగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. కొణిజర్ల మండలం లాలాపురంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ యాజమాన్యం రూ.కోట్ల విలువైన సీఎంఆర్ ఎగ్గొట్టింది. ఇదే తరహాలోనే మరో నాలుగు మిల్లులు కూడా ఉన్నట్లు గుర్తించారు. ధాన్యం తీసుకున్న 66 మిల్లుల్లో కొన్ని మాత్రమే అతితక్కువగా సీఎంఆర్ ఎందుకు చెల్లించాయనే కోణంలో ఆరా తీయగా ఇందులో ముగ్గురు అధికారుల పాత్ర బయటపడినట్లు సమాచారం. వీరి ప్రమేయం లేకుండా మిల్లుల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడడం సాధ్యం కాదని భావిస్తున్నారు.

కొరవడిన సమన్వయం
మిల్లులకు ధాన్యం అప్పగించాక సీఎంఆర్ వసూలు చేయడంలో పౌర సరఫరాల సంస్థ అధికారుల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. నిరంతరం తనిఖీలు చేస్తూ గడువులోగా సీఎంఆర్ సేకరించాల్సి ఉన్నా అధికారుల మధ్య సఖ్యత లేక ఇది సాధ్యం కాలేదని సమాచారం. రబీ, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కొన్ని సందర్భాల్లో మాత్రమే మిల్లులను తనిఖీ చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ రూ.కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పడుతున్నా ఎందుకు స్పందించలేదో తెలియడం లేదు. అయితే, సీఎంఆర్‌ను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్న కొందరు మిల్లర్లు అధికారులకు భారీ నజరానా ముట్టచెప్పినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఫిర్యాదుల ఆధారంగా ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతాధికారులు తనిఖీలకు ఉపక్రమించారు. ఈ మేరకు తనిఖీలు, దాడుల విషయం తెలిసి కొందరు మిల్లర్లు తాము డబ్బు అందించిన అధికారులను నిలదీసినట్లు తెలిసింది. ఈ నేపథ్యాన ఆయా అధికారులపై శాఖాపరమైన విచారణ చేపడతారా.. మిల్లర్ల నుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తారా.. అనేది తేలాల్సి ఉంది.

ఇప్పుడేం చేస్తారో?
వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యాన ప్రభుత్వం సీఎంఆర్ వసూళ్లపై దృష్టి పెట్టింది. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో సమావేశమై వారి వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేయడమే కాక సీఎంఆర్ వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇక మిల్లర్లతో సమావేశమైన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బియ్యం అందజేయాలని తెలిపారు. ఈక్రమాన ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులనే సీఎంఆర్ వసూలు చేయమంటారా.. లేకపోతే మొత్తం వ్యవహారంలో వారిని బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటారా అనేది తేలాల్సి ఉంది.

పల్లె ఓటర్లు.. 8,52,879 మంది

- అత్యధికంగా ఖమ్మం రూరల్‌లో, తక్కువగా వైరాలో..
- అన్ని మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికం
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఫొటోతో కూడిన ఓటరు తుది జాబితాను తయారుచేసింది. జాబితాను శనివారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత విడుదల చేయగా అన్ని గ్రామపంచాయతీల్లో ప్రదర్శించారు. జిల్లాలో 589 గ్రామపంచాయతీలకు గాను 5,398 వార్డులు ఉండగా మొత్తం 8,52,879మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. ఇందులో 4,39,808మహిళలు, 4,13,048 మంది పురుషులు ఉన్నారు. కాగా, మొత్తం ఓటర్లలో ఇతరుల కేటగిరీలో 23 మంది ఓటర్లు నమోదు కాగా, అత్యధికంగా రఘునాథపాలెం మండలంలో ఆరుగురు ఉన్నారు. ఈనెల 13న ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు 922 అభ్యంతరాలను పరిష్కరించాక తుది జాబితా ప్రకటించారు.

ఖమ్మం రూరల్‌లో అత్యధికం
జిల్లాలో మొత్తం 8,52,879 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలోని 31 గ్రామపంచాయతీలు, 312 వార్డులకు గాను 78,539 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో 40,807 మహిళలు, 37,728మంది పురుషులు ఉన్నారు. ఇక అతి తక్కువగా వైరా మండలంలోని 22 జీపీలు, 200 వార్డులకు 26,922 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 13,909 మంది మహిళలు, 13,013 మంది పురుషులు ఉన్నట్లు వెల్లడైంది.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం	మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
ఖమ్మం రూరల్	37,728	40,807	78,539	చింతకాని	19,687	21,340	41,027
కల్లూరు	26,176	27,470	53,649	రఘునాథపాలెం	19,090	20,954	40,050
తిరుమలాయపాలెం	24,075	25,705	49,780	ఎర్రుపాలెం	19,356	20,407	39,764
కూసుమంచి	23,922	25,528	49,451	వేంసూరు	17,964	18,579	36,543
నేలకొండపల్లి	23,525	25,633	49,159	బోనకల్	17,435	18,455	35,891
ముదిగొండ	23,091	25,026	48,119	సత్తుపల్లి	17,177	18,329	35,506
తల్లాడ	22,315	23,336	45,652	కామేపల్లి	17,181	17,779	34,960
సింగరేణి	21,925	22,862	44,790	మధిర	15,059	16,084	31,145
పెనుబల్లి	20,990	22,086	43,076	ఏన్కూరు	13,236	14,340	27,557
కొణిజర్ల	20,103	21,176	41,279	వైరా	13,013	13,909	26,922
				మొత్తం	4,13,048	4,39,808	8,52,879



త్వరలో ఖిల్లాపై రోప్‌వే !

టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి


రోప్‌వే ప్రతిపాదనలను ఎండీకి వివరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం ఖిల్లాపై త్వరలోనే రోప్ వే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఖిల్లాను శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సందర్శించిన ఆయన మాట్లాడారు. కింద నుంచి నేరుగా ఖిల్లాపైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయని, ఇది పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా జాఫర్ బావిని కూడా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రోప్‌వే ఇళ్ల మధ్య నుంచి కాకుండా ఖాళీస్థలం మీదుగా నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులపై చర్యలు?

సాగర్ గండి పూడ్చివేత జాప్యమే కారణం

ఖమ్మంఅర్బన్: భారీవర్షాలు, వరదతో సాగర్ ప్రధాన కాల్వకు కూసుమంచి వద్ద పడిన గండిని పూడ్చడంలో ఇంజనీర్ల మధ్య సమన్వయ లేమి, ప్రణాళిక లోపంతో ఆలస్యం జరిగిందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా రైతులకు నీరందించడంలో ఆలస్యం జరిగి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందనే భావనతో ఇంజనీర్లపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మరమ్మతులు చేసే క్రమాన యూటీ వద్ద పైపులు వేయకుండా పూడ్చివేయడం, అక్కడకు వచ్చే నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయాలని నిర్ణయించడాన్ని తప్పు పట్టినట్లు సమాచారం. ఈమేరకు నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం.. ఇద్దరు లేదా ముగ్గురు ఇంజనీర్లపై చర్యలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

పరిష్కారం లేని సమస్య ఉండదు..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్
- లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 10,820 కేసుల పరిష్కారం


మృతురాలి కుమార్తెకు చెక్కు అందిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: మంచి మనసుతో ప్రయత్నిస్తే పరిష్కారం లేని సమస్య అంటూ ఉండదని.. ఇందుకు సరైన వేదికగా లోక్ అదాలత్ నిలుస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో శనివారం ఆయన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరుపక్షాలు గెలుపొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవలే ఖమ్మం వరదలతో సతమతమైనా కక్షిదారులు ఉత్సాహంతో లోక్ అదాలత్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈమేరకు సహకరించిన న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీల అధికారులు, ఎక్సైజ్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా రాజీమార్గంలో పరిష్కారమైన మూడు కేసుల్లో కక్షిదారులకు జిల్లా జడ్జి పూల మొక్కలు, లోక్ అదాలత్ అవార్డులు అందించారు. న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావుతో పాటు న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, ఎం.కల్పన, కె.దీప, బి.రజిని, వై.బిందు, ప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ బాధ్యులు కె.ఉపేందర్‌రెడ్డి, చింతనిప్పు వెంకట్ పాల్గొన్నారు.

వాహనాలకు బీమా తప్పనిసరి
రోడ్డుపైకి వచ్చే ప్రతీ వాహనానికి సరైన బీమా ఉండాలని..లేకపోతే వాహనదారుడే కాక ఇతరులు మూల్యం చెల్లించాల్సి వస్తుందని జిల్లా జడ్జి రాజగోపాల్ అన్నారు. లోక్ అదాలత్‌లో భాగంగా 2017లో జరిగిన ఆటో ప్రమాదంలో మహిళా హోంగార్డు మృతి చెందగా ఆమె కుమార్తెకు ఆటో యజమాని ద్వారా రూ.2.50 లక్షలు చెల్లించే కేసును పరిష్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీమా లేకపోవడం వల్ల ఇరుపక్షాల వారు నష్టపోయారని, బీమా ఉంటే మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల పైగా పరిహారం అందేదని తెలిపారు. కానీ ఇప్పుడు ఆటో యజమాని చెల్లించాల్సి వచ్చిందని చెప్పారు.

10,820 కేసుల పరిష్కారం.. రూ.4.7 కోట్ల పరిహారం
జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌తో 10,820 కేసులు పరిష్కారమయ్యాయి. మోటార్ వాహన ప్రమాద కేసుల బెంచ్‌లో అదనపు జిల్లా జడ్జి అర్చనకుమారి 91 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.52 కోట్ల నష్టపరిహారాన్ని అందించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వి చంద్రశేఖరరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కల్పన, న్యాయమూర్తులు బి.రజిని, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, సలీం వివిధ బెంచ్‌ల్లో కేసులు పరిష్కరించారు.

పత్తి కొనుగోళ్లకు 15కేంద్రాలు

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. జిల్లాలో 1,99,700 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 1,79,730 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలో ఐదు సీసీఐ కేంద్రాలు, 10 జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. పొడవు పింజ రకం పత్తి క్వింటాకు రూ.7,521, మధ్య పింజ రకానికి రూ.7,121 మద్దతు ధర ప్రకటించగా, వచ్చే నెల రెండో వారం నుంచి రైతులు తీసుకురానున్నందున కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ.అలీమ్, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు ఎస్.విజయబాబు, బి.అజయ్ కుమార్, సతీష్, అవినాష్, తయాడే, పి.ప్రవీణ్ కుమార్, మోహిసిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సేవారంగంలో 'చేతన'కు అవార్డ్


అవార్డు అందుకుంటున్న రవికుమార్ (ఎడమ)

ఖమ్మంసహకారనగర్: గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సంస్కృతి విభాగం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఇటీవల అమెరికాలో జరగగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ఈ మేరకు చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ల రవికుమార్ సామాజిక సేవలో ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఇండియాతో పాటు అమెరికాలో ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే దూదిపాళ్ల నరేంద్రకుమార్, గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సంస్కృతి విభాగం అధ్యక్షుడు కృష్ణలామ్ తదితరులు పాల్గొన్నారు.

నవతరానికి స్ఫూర్తిప్రదాత భగత్‌సింగ్


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొన్న భగత్‌సింగ్ నేటి యువతకు సైతం స్ఫూర్తిదాయకమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్య్ర ఆకాంక్షను నిలువెల్లా నింపుకొని ఆంగ్లేయులపై తిరగబడడమే కాక యువతను భాగస్వామ్యులుగా చేశారని గుర్తుచేశారు. నాయకులు షేక్ జానీమియ, శింగు నర్సింహారావు, సిద్ధినేని కరుణకుమార్, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, బోడ వీరన్న, సైదా, తాటి నిర్మల పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలి


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కొణిజర్ల: ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్‌జీటీలకు సముచితస్థానం కల్పించి న్యాయం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. కొణిజర్లలో శనివారం జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు గోరింట్ల విజయ్ అమృతకుమార్, జిల్లా కార్యదర్శి ఆర్.బ్రహ్మారెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, కొత్త పీఆర్‌సీ అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అనంతరం బదిలీ ఎంఈఓ ఎం.శ్యాంసన్, నూతన ఎంఈఓ అబ్రహంను సన్మానించారు. నాయకులు అనంతోజు పుల్లయ్యచారి, జి.సుందర్, జి.వెంకటేశ్వరరావు, సాంబశివరావు, మేకల శ్రీనివాసరావు, తూమాటి సైదుబాబు, ఎ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ బిల్ కలెక్టర్‌పై వేటు

ఇంటి పన్ను పెంచకుండా డబ్బు డిమాండ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య కొరడా ఝులిపించడం ప్రారంభించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఆదాయం పెంచుకునేందుకు నిర్మాణాలను పరిశీలించి పన్నుల సవరణకు ఇంటింటి సర్వే చేయించారు. ఈ క్రమంలో 25వ డివిజన్‌లో అదనపు నిర్మాణాలకు పన్ను పెంచకుండా ఉండేందుకు బిల్‌కలెక్టర్ విజయ్ యజమాని నుంచి డబ్బు డిమాండ్ చేసినట్లు కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కాల్ రికార్డ్ ఆధారంగా విజయ్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

భార్యాభర్తల గొడవలో వృద్ధురాలి మృతి

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి భార్యాభర్తలు గొడవ పడుతుండగా మధ్యలో వెళ్లిన భర్త తల్లి కన్నుమూసింది. గ్రామానికి చెందిన తాటికొండ మార్తమ్మ(60)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పాపయ్య తన భార్య మణితో గొడవపడి కొడుతుండడంతో తల్లి మార్తమ్మ అడ్డుపడింది. దీంతో కోపోద్రిక్తుడైన ఆయన తల్లిని పక్కను నెట్టేయడంతో కింద పడగా గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు పాపయ్యను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ ఘటనపై గ్రామంలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

డీసీసీబీ తీరుపై సొసైటీ చైర్మన్ల గరంగరం

రైతు రుణమాఫీపై కొరవడిన స్పష్టత

- రైతుబీమాలో తప్పిదాలను బయటపెట్టాలని డిమాండ్
- ఎరువుల సరఫరాలో మార్క్‌ఫెడ్ తీరుపైనా నిలదీత
- వాడీవేడిగా జరిగిన డీసీసీబీ మహాజన సభ


సత్తుపల్లి పీఏసీఎస్ చైర్మన్, సీఈఓలను సత్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్రసహకార బ్యాంకు(డీసీసీబీ) తీరుపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు నిర్వాకంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. బ్యాంకు 125వ మహాజన సభ శనివారం ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత బ్యాంకు సీఈఓ వి.వసంతరావు వార్షిక నివేదిక ప్రకటిస్తుండగా రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని పట్టుబట్టారు. డీసీసీబీ పరిధిలో 1.69 లక్షల మంది రుణమాఫీకి అర్హులైతే 65 వేల మందికి వర్తించిందని తెలిపారు. బ్యాంకు అధికారులు, ఉద్యోగుల తప్పిదాలతో రైతులు నష్టపోయారని చెప్పారు. ఇక బ్యాంకు ఏటీఎంలు చాలాచోట్ల పని చేయక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు.

తప్పిదాలను బయటపెట్టాలి

రైతుబీమాలో జరిగిన తప్పిదాలను బయటపెట్టాలని సొసైటీ చైర్మన్లు డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీతో రైతుల జీవిత బీమా గడువు ముగియడంతో ఆ తర్వాత మరణించిన వారి కుటుంబాలు నష్టపోతున్నాయని తెలిపారు. 1.12 లక్షల మంది రైతుల సమస్యపై ఎందుకు బాధ్యతగా వ్యవహరించటం లేదని ప్రశ్నించారు. ఇక డీసీసీబీ లాభాలను సహకార సంఘాలకు ఎందుకు పంచడం లేదని ఆరా తీశారు. బ్యాంకు ఉద్యోగులకు ప్రోత్సాహకాలను ఇచ్చిన పాలకవర్గం సీఈఓలను విస్మరించడం సరికాదన్నారు. పాలక వర్గం చేసే తీర్మానాలను మహాజన సభకు వివరించడమే కాక సాధారణ ఖర్చుల కింద పేర్కొన్న రూ.18 లక్షల వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

పోడు భూములకు రుణాలు ఇవ్వాలి

ఏజెన్సీ ప్రాంతంలో పోడు భూములు కలిగిన రైతులకు రుణాలు ఇవ్వాలని ఆయా ప్రాంతాల 26 పీఏసీఎస్‌ల చైర్మన్లు ఈ సభలో డిమాండ్ చేశారు. స్వల్పకాలిక రుణాలతో పాటు, మధ్య కాలిక, దీర్ఘకాలిక, బంగారం రుణాలు ఇవ్వాలని కూడా ఇవ్వాలని సూచించారు. కాగా, ఒక్కో సహకార సంఘానికి రూ.20 లక్షల విలువైన ఎరువులు సరఫరా చేయాల్సి ఉండగా రూ.10 లక్షల మేరకే చేస్తున్నారని, అది కూడా ముందుగా నగదు చెల్లించాలని మార్క్‌ఫెడ్ ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. పలు రకాల ఎరువుల ధరలు బయటి మార్కెట్ కన్నా సహకార సంఘాల్లో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బ్యాంకులో లోపాలను సవరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో మాదిరి రైతుబీమా కొనసాగిస్తామని, ఏటీఎంల నిర్వహణలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రుణమాఫీ అంశంలో ఆధార్, బ్యాంకు వివరాలు పోలిక లేకపోవటంతో 4,100 మందికి వర్తించలేదని, ప్రభుత్వ ఆదేశాలతో అమలు చేస్తామని తెలిపారు. అనంతరం రుణాల రికవరీ, కొత్త రుణాల మంజూరులో ప్రగతి కనబర్చిన సత్తుపల్లి, నాగులవంచ, మీనవోలు, ఖమ్మంపాడు, పినపాక, చిన్నకోరుకొండి, గుండాల, బయ్యారం, వి.వెంకటాయపాలెం పీఏసీఎస్‌ల చైర్మన్లు, సెక్రటరీలను సత్కరించారు. బ్యాంకు డైరెక్టర్లు అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, చావా వేణుగోపాల్‌కృష్ణ, లక్కినేని సురేందర్‌రావు, బోబోలు లక్ష్మణ్‌రావు, మేకల మల్లిబాబుయాదవ్, జనగాం కోటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత, వ్యవసాయ శాఖ ఏడీఏ వాసవీరాణి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా తొలి అడుగు మాత్రమే..

- నైపుణ్యం పెంచుకుని మరింత ఎదగాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ఉద్యోగానికి ఎంపికైన యువతులకు ఆఫర్ లెటర్లు ఇస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంరాపర్తినగర్: యువత ప్రయాణంలో జాబ్‌మేళాను తొలి అడుగుగా భావించాలని.. ఈ ఉద్యోగం చేస్తూనే ఉన్నత స్థాయికి చేరేలా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. యువత తమను తాము తక్కువగా అంచనా వేసుకోకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని తెలిపారు. ఆపై వాటి సాధనకు కృషి చేస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. ఈ జాబ్ మేళాకు 18 కంపెనీల బాధ్యులు హాజరుకాగా 1,500కు పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లు అందించారు. రీజినల్ ఉపాధి అధికారి రవీందర్, జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ జాకీరుల్లా, ఐటీఐ ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, రామకృష్ణ, ఉద్యోగులు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఖమ్మంసహకారనగర్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటూనే రేబిస్ సోకకుండా టీకాలు వేయిస్తున్నామని తెలిపారు. కాగా, విద్యార్థినులు ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం తెలుగు సాహితీవేత్త గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుమనోహర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం, ఉల్లాసం


పులిగుండాల ప్రాజెక్ట్ వద్ద విద్యార్థినులు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్/పెనుబల్లి: విద్యార్థినులు విహారయాత్రను వినియోగించుకోవాలని.. తద్వారా విజ్ఞానం పెరగడమే కాక ఉల్లాసంగా ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట పులిగుండాల ప్రాజెక్ట్ (కనకగిరి గుట్టలు)ను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థినుల బస్సును కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు యాత్రలో పరిశీలించిన అంశాలపై నివేదిక తయారు చేయాలని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుమనోహర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి బి.సుమన్ చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామకుమారస్వామి, అధ్యాపకులు శ్యామలాదేవి, శైలజ, గాయత్రి, సింధు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్

- హోరాహోరీ పోటీలో ప్యానల్ విజయం
- నూతన కమిటీని అభినందించిన రాయల, రమేశ్‌రెడ్డి


సంబురాలు చేసుకుంటున్న యుగంధర్ ప్యానల్ సభ్యులు

ఖమ్మంఅర్బన్: 'ది ఖమ్మం గ్రానైట్ శ్లాబ్, ఫ్యాక్టరీల ఓనర్ల అసోసియేషన్'అధ్యక్షుడిగా పాటిబండ్ల యుగంధర్ 35 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఖమ్మంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ఓట్లు లెక్కించి విజేతల వివరాలను ఎన్నికల అధికారి ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. అధ్యక్ష స్థానం కోసం వేముల రవికుమార్, పాటిబండ్ల యుగంధర్ రెండు ప్యానెళ్లుగా పోటీ పడ్డారు. ఈ మేరకు యుగంధర్ ప్యానల్‌ను విజయం వరించింది. మొత్తం 447 ఓట్లకు గాను 413 ఓట్లు పోల్ కాగా యుగంధర్‌కు 224, రవికుమార్‌కు 189 ఓట్లు రావడంతో యుగంధర్ 35 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇక కార్యదర్శిగా కమర్తపు గోపాల్‌రావు.. మంకెన శేఖర్‌పై, సహాయ కార్యదర్శిగా షేక్ రియాజ్.. ఎస్.డీ.ఖాజా మొయినుద్దీన్‌పై గెలుపొందారు. కోశాధికారిగా ఎం.పరమేశ్వరరెడ్డి ఆకుల నాగేశ్వరరావుపై విజయం సాధించారు. ఈసీ-1 గా డి.శ్వేధన్, ఈసీ-4గా పి.రవికుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటికే వైస్ ప్రెసిడెంట్-1, 2లుగా కొనకంచి శ్యాంప్రసాద్, తమ్మినేని సాగర్, జాయింట్ సెక్రటరీ-2గా చావా రామూర్తి, ఈసీ-2, 3, 5లుగా ఎం.అనిల్‌కుమార్, బి.లాలప్రతాప్, బి.రాజగోపాల్‌రెడ్డి ఏకగ్రీవమైన విషయం విదితమే. కాగా, యుగంధర్ ప్యానెల్ విజయానికి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రానైట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు సాధు రమేశ్‌రెడ్డి కృషి చేయగా ప్యానల్‌గా వారు అభినందించారు.

ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

కొణిజర్ల: గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయడానికి పంచాయతీ తాగునీటి సహాయకులు కృషి చేయాలని మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన గ్రామాల రూపకల్పనలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో చేతి పంపు మరమ్మతులను ఆయన పరిశీలించారు.ఈఈ డి.పుష్పలత, డీఈఈ నర్సింహారావు, ఏఈ సతీశ్, ఎంపీడీఓ రోజారాణి, ఉద్యోగులు అంజంరాజు, భాస్కర్,ఇమాంబీ, ధనలక్ష్మి, భారతమ్మ, సైదులు, ముత్తయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో ఎన్నెస్పీ కాల్వలపై అక్రమంగా చేపట్టిన కట్టడాల కూల్చివేత కొనసాగుతోంది. ఇటీవల బాలాజీనగర్‌లో మున్సిపాలిటీ ఉద్యోగి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసిన విషయం విదితమే. ఇక శనివారం శనివారం మరో ఇంటిని సైతం కూల్చివేయించారు. మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, టౌన్ ప్లానింగ్ అధికారులు భాస్కర్ పర్యవేక్షించారు.

నా కుమారుడినీ ఆదరించండి..

టీవీ, సినీనటుడు ప్రభాకర్


మాట్లాడుతున్న ప్రభాకర్, పక్కన చంద్రహాస్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ప్రజలు తనను ఆదరించినట్లుగానే తన కుమారుడు చంద్రహాస్‌ను సైతం అక్కున చేర్చుకోవాలని సినీ, టీవీ నటుడు ప్రభాకర్ కోరారు. చంద్రహాస్ హీరోగా నటించిన రామ్‌నగర్ బన్నీ సినిమా వచ్చేనెల 4న విడుదల కానుండగా ఖమ్మంలోని వెలాసిటీ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమారుడు చంద్రహాస్‌కు ఇది మొదటి సినిమా అయినా బాగా నటించాడని తెలిపారు. అనంతరం చంద్రహాస్ మాట్లాడుతూ తన తండ్రి ప్రభాకరే రోల్ మోడల్ అని తెలిపారు. హీరోయిన్లు విస్మయ్‌శ్రీ, అంబికావాణి, వెలాసిటీ కళాశాల చైర్మన్, బాధ్యులు శెట్టి లక్ష్మణ్‌రావు, మల్లోజు రవి, మహమ్మద్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి..


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న యూఎస్‌పీసీ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: అసంబద్ధంగా ఉన్న ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవడమే కాక ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో లోపాలను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ బాధ్యులు పి.నాగిరెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.విజయ్ మాట్లాడుతూ బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయడమే కాక ఉపాధ్యాయుల బదిలీ అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ప్రతీ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, 30 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఏర్పాటు చేయాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ రంజాన్, వల్లంకొండ రాంబాబు, యాదగిరి, మన్సూర్, షమీ, సుధాకర్, శ్యాంసుందర్, సురేశ్, నాగిరెడ్డి, సంధ్యారాణి, విజయలక్ష్మి, చిరంజిత, అంజలి, కట్టా పద్మ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఖమ్మంసహకారనగర్: డీఎస్సీ-2008 కామన్ మెరిట్‌లో ఎంపికైన ఏజెన్సీ ప్రాంత అభ్యర్థులు 67 మంది రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేవని ఖమ్మం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. 2008 డీఎస్సీలో ఎంపికైన వారిని ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా నియమించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం ఏజెన్సీ అభ్యర్థులు 67 మంది ఎంపికైనా పేర్లు లేకపోవడంతో 30వ తేదీన జరిగే కౌన్సెలింగ్‌కు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు ఎల్.రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదును పరిశీలించిన డీఏఓ


పత్తిలో తెగుళ్లను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

తల్లాడ: మండలంలోని మల్లవరంలో పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య శనివారం పరిశీలించారు. నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించారు. అనంతరం వరి, పత్తి, మిరపలో ఆశిస్తున్న తెగుళ్లను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, ఏఓ ఎండీ తాజుద్దీన్, ఏఈఓలు సాయికుమార్, మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సేల్స్ రిప్రజెంటేటివ్ మృతి


సీతయ్య (ఫైల్)

వైరా: వైరా ఐఎంఎల్ డిపోలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న వ్యక్తి శనివారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కొణిజర్ల మండలం చిన్న మునగాలకు చెందిన చెరుకుమల్లి సీతయ్య (42) 25 ఏళ్ల కిందట వైరాకు వచ్చి ఇక్కడే నివాసముంటూ ఐఎంఎల్ డిపోలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నివాసం ఉంటున్న ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి రేకుల షెడ్డు వేసి సెంట్రింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. కాగా, సీతయ్య శనివారం తెల్లవారుజామున ఇంటి ముందు నీళ్లు చల్లి శుభ్రం చేసే క్రమాన కాలు జారి పడుతూ సెంట్రింగ్ దుకాణం లైటింగ్ బోర్డును ఆసరాగా పట్టుకున్నాడు. అయితే, బోర్డుకు విద్యుత్ సరాఫరా అవుతుండడంతో సీతయ్య షాక్‌కు గురికాగా నాగేశ్వరరావు అనే వ్యక్తి కర్రలతో విడిపించాడు. ఆతర్వాత ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, సెంట్రింగ్ దుకాణం నిర్వాహకుడి నిర్లక్ష్యంతోనే సీతయ్య మృతి చెందాడని ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య శైలజ, ఆరేళ్ల కుమారుడు వైష్ణు ఉన్నారు.

విదేశాలకు వెళ్లిన మహిళ ఇంట్లో చోరీ

నేలకొండపల్లి: ఇంటికి తాళం వేసిన యాజమాని విదేశాలకు వెళ్లినట్లు పసిగట్టిన ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లికి చెందిన మురహరి కోటేశ్వరి ఇటీవల అమెరికా వెళ్లారు. ఈమేరకు శుక్రవారం అర్ధరాత్రి తాళం పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తి బీరువాలో ఉన్న దిద్దులు, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఈవిషయాన్ని శనివారం ఉదయం ఆవరణలో శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి గుర్తించి పై అంతస్తులో అద్దెకు ఉండే వ్యక్తి సాయంతో యజమానికి చెప్పడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ముసుగు వేసుకున్న వ్యక్తి చోరీకి పాల్పడినట్లు పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీకి యత్నం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి శివారులో ఉన్న శ్రీ పులిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి యత్నించారు. ఆలయం ఇనుప గ్రిల్స్, తలుపుల తాళాలు పగులగొట్టి లోనకు ప్రవేశించారు. ఆపై గర్భగుడిలోకి వెళ్లి సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను కూడా తొలగించారు. ఈమేరకు శనివారం ఉదయం వచ్చిన అర్చకులు ఈ విషయాన్ని గుర్తించి ఈఓ ఎస్.బీ.డీ ప్రసాద్, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరించగా, ఆలయంలో వస్తువులన్నీ భద్రంగా ఉన్నట్లు తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.

4.9 కిలోల గంజాయి స్వాధీనం

పెనుబల్లి: ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి ఏపీకి బైక్‌పై గంజాయి తీసుకెళ్తున్నారనే సమాచారంతో సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్సర్ బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులను తనిఖీ చేయగా 4.900 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్ఐ ఆర్.కిషన్, ఉద్యోగులు నాగరాజు, సురేష్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


రామారావు (ఫైల్)

వేంసూరు: మండలంలోని కందుకూరు తుంగవారి కాలనీకి చెందిన తుంగ రామారావు(56) బుధవారం తమ్మిలేరులో గల్లంతు కాగా శనివారం ఆయన మృతదేహం లభించింది. తమ్మిలేరులో ఉన్న గేదెలను ఒడ్డుకు తీసుకొచ్చే క్రమాన ఆయన గల్లంతయ్యాడు. దీంతో పోలీసులు గజఈతగాళ్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా శివాపురం సమీపాన వాగులో మృతదేహం లభించింది. ఈమేరకు పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఎజ్జు తేజ (ఫైల్)

కారేపల్లి: హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి చౌటుప్పల్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారేపల్లి మండలం పెద్దమడెంపల్లి గ్రామానికి చెందిన ఎజ్జు తేజ (24) మృతి చెందాడు. ఖమ్మంలోని ఓ మొబైల్ కంపెనీలో (జియో) టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తేజ.. కంపెనీ పనిపై బస్సులో హైదరాబాద్ వెళ్తున్నాడు. చౌటుప్పల్ వద్దకు రాగానే బస్సు నిలిచిపోయింది. దీంతో డ్రైవర్‌తో పాటు తాను బస్సు దిగి చెడిపోయిన బస్సును పరిశీలిస్తుండగా.. జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టడంతో తేజ అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో.. తల్లిదండ్రులు ఎజ్జు రత్నం, పుష్ప గుండెలుపగిలేలా రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.